
# విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు! తెలుగు నాట తెన్నేటిమాట! పాటగా పల్లవించింది!

## -విశాఖకు ఉక్కు ఫ్యాక్టరీని తెచ్చిపెట్టింది!!-




**1931 సం॥ములో కరాచీలో జరిగిన కాంగ్రెసు మహాసభలో దక్షిణ భారతానికి అన్యాయం జరుగుతుందంటూ గాంధీనే ప్రశ్నించిన ధైర్యశాలి! శుద్ధ ఖద్దరు వస్త్రధారి! పరిశుద్ధ దేశభక్తుడు. ఆయన గుండె అంతా తెలుగు అభిమానంతో నిండిపోయింది. అలాటి తేట తెలుగువాడు మరల పుట్టలేదు. పుడతాడని ఆశించనూలేము. ఆంధ్రుల ఆత్మగౌరవం అన్న మాట 'తెన్నేటి' వారి నుంచే నేర్చుకోవాలి.**

నాయకునిలో చిత్తశుద్ధి ఉండాలి. నాయకత్వ సమర్ధత ఉండాలి! కించిత్తు వ్యామోహాన్ని కూడా దరికి చేరని దర్శనీయులు లేరనడం ప్రస్తుత కాలంలో నిందాడడం తప్పు కాదు. శీలస్వచ్ఛతకు చిలుము పట్టింది.

ఓ గురువుగారు– నలుగురు శిష్యులకు నాలుగు ఫలాలనిచ్చి– రెండోకంటివానికి తెలియకుండా తిని రమ్మన్నారు. ముగ్గురు శిష్యులు వారికిచ్చిన ఫలాలను ఆశ్రమం గదుల్లోకి వెళ్ళి తినివచ్చారు. ఒక శిష్యుడు తినకుండా ఫలాన్ని తెచ్చాడు. గురువుగారు ఎందుకు తినలేదని ప్రశ్నించారు. ఎవరూ చూడకుండా తినడం తనకు సాధ్యం కాలేదని చెప్పాడు. తినుటకు ఎక్కడ కూర్చున్నప్పటికినీ భగవంతుడు చూస్తున్నాడనే భావం కలిగింది. మీరు యెవరూ చూడకుండా తిన మనడం నాకు సాధ్యం కాలేదు - అన్నాడు.



ఇక్కడ అదృశ్యభావం అంతఃకరణం. దాని పరి భాష శీలం. ఇరవైనాలుగు వన్నెల బంగారం దాన్ని శరీరంపై ధరించి ఇరవై వన్నెలుగా గుణశీలుడు భావించలేడు.

జూదంలో సింహాసనం, సకలైశ్వరములు పోయి వనవాసం, అజ్ఞాతవాసముల్చేయవలసి వచ్చిన ధర్మరాజు నిరాశచెందలేదు. కర్మయోగిగానే అడవు లకు వెళ్ళాడు.

సత్యనిష్ఠకోసం హరిశ్చంద్రుడు రాజ్యాన్నీ సర్వమూ త్యాగం చేసాడు. రాజభోగాలను ఆశించలేదు.

తెన్నేటి విశ్వనాధంగారు అంతటి సత్యనిష్టాపరుడు. గుణశీలుడు. స్థితప్రజ్ఞుడు. దేశభక్తుడు, దేశాభ్యున్నతి తక్క ఆయన దేనికీ ప్రాధాన్యమివ్వలేదు. దేశం కోసం వ్యక్తి ప్రయోజనం, పదవీ ముఖ్యం కాదనీ భావించిన నిస్వార్ధనాయకుడు, గెలుపు, ఓటములు సమంగా భావించినవాడు.

విశాఖపట్నమునకు ఉక్కు ఫాక్టరీ రావడానికి తెన్నేటి విశ్వనాధంగారే కారకుడు. ఇప్పటికీ విశాఖ జనులు, ఆంధ్రజనులు విశ్వనాధం గారికి ఋణపడి ఉంటారు. ఆంధ్ర రాష్ట్రానికి అంతగొప్ప కర్మాగారం వచ్చిన కారణంగా వేల కొలదీ జనులకు ఉపాధి కల్గింది.

**విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు** అంటూ తెన్నేటివారు ఉవ్వెత్తు ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తెన్నేటివారి కారణంగానే విశాఖకు ఉక్కు కర్మాగారం వచ్చింది.

నాగార్జున ప్రాజెక్టు, ఆంధ్ర ఉద్యమం, విశాలాంధ్ర ఉద్యమం, జైఆంధ్రా పోరాటం–అన్ని ఉద్యమాలకూ ముందు నిలిచారు. సమాజం కోసం ప్రజల కోసం, తెన్నేటి తన జీవితాన్ని సర్వసమర్పణం చేసుకున్నారు.

ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారికి కుడిభుజంలా ఉన్నారు. వారిరువుర్నీ వేఱుచేయాలని ఎంతోమంది ప్రయత్నించి విఫలు రయ్యారు. తెన్నేటివారు తన జీవితాన్ని దేశానికే అంకితం చేసారు. అలాటి స్థితప్రజ్ఞగల నాయకులు మరల పుట్టరేమో! ఆయన జనసేవ జీవితమూలోనూ, గృహజీవితంలోనూ అలాటి సత్యధర్మనిరతినే పాటించారు.

ఆయనకు చిన్న వయసులోనే వివాహమైంది. భార్య చిన్న బాలిక. కామేశ్వరి ఆమె పేరు. వివాహ మైన కొద్ది కాలానికే ఆమె మరణించింది. కుటుంబ పెద్దలు తిరిగి వివాహం చేయాలని సకల ప్రయ త్నాలూ చేసారు. ఆయన ససేమిరా చేసుకోనన్నారు.

ఆయన కవి, కళాపోషకుడు. సత్యవాక్పాలకుడు మహాత్ముణ్ణి కొన్ని విషయాల్లో ఎదురు ప్రశ్నలు వేసి నప్పటికినీ, ఆయన సిద్ధాంతాలను తు.చ. తప్ప కుండా పాటించారు.

ఆయన పదవుల కోసం వెంపర్లాడలేదు. పద వులే ఆయన్ని కోరివచ్చాయ్. లోక్‌సభ స్పీకర్ పోటీల్లో ఆయన పరాజితులయ్యారు. ఇందిరాగాంధీ డిప్యూటీ స్పీకర్ పదవినిస్తాను అన్నారు. స్పీకర్ పోటీల్లో ఓడిపోయి–డిప్యూటీ స్పీకర్ పదవిని చేయ డం అనైతికమని భావించారు. లాకమిషన్ చేర్మన్‌గా పనిచేసి ప్రధాని నెహ్రూచే ప్రశంసింపబడ్డారు.

ప్రకాశం పంతులుగారికి పార్లమెంటు సెక్రటరీగా పనిచేసారు. అత్యయిక పరిస్థితిని ఎదురిస్తూ జైలు శిక్ష అనుభవించారు. శాసనసభ్యునిగా, లోక్‌సభ సభ్యునిగా, రాష్ట్రమంత్రిగా ఎన్నో పదవుల్ని అకళం కంగా పనిచేసారు. ఆ పదవులకు వన్నె తెచ్చారు. విశాఖ సారస్వత వేదికను స్థాపించారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించారు. ఏ పదవిని నిర్వహించినా నిర్వహించకున్నా - ఆయన ఆంధ్రాభిమానమే అమృత తుల్యంగా భావించారు. రాజకీయ రంగంలో మణిపూసగా వర్ధిల్లారు. వ్యక్తి గౌరవాన్ని పాటించారు. ఆత్మగౌరవమంటే అదే.

1895 సం॥ము సెప్టెంబరు 9న విశాఖపట్నం జిల్లా లక్కవరంలో జన్మించారు. విశాఖ జిల్లాకు ఎనలేని సేవచేసారు. 1979 సం॥ము నవంబర్ 10 తేదీన తెన్నేటివారు కన్నుమూసారు. ఆయన తన 84వ యేట కాలధర్మమొందేవరకూ– ఆయన బొందిలో దేశ సేవ, జనసేవ తక్క అన్యమార్గము నెన్నుకోలేదు. ఆయన కీర్తి కిరీటంలో విశాఖ ఉక్కు కర్మాగారం ఉన్నది. ఉక్కు మనిషిగానే జీవించారు.

ఆంధ్రులు చేసుకున్న పుణ్యప్రోవు ఆయన! ఎంతమంది మనలో తెన్నేటి వారున్నారో తెలియదు కానీ - అట్టివాడు తెలుగువాడు లేడనే చెప్పాలి. ●

# రాజధాని నగర కోటలు మనవాళ్ల మేధఃమూటలు!

ఆత్మఘోష




రాజుల రాజధానీ నగరాలు శిల్పకళా సమన్వితాలు. ఆకాశమంత ఎత్తుగల భవనాలు కావు. అంతరిక్ష పరిజ్ఞానమూ పనిచేయలేదు. ఇటుకల నిర్మాణం కూడా కిటుకు ఏంవిటో తెలుసుకోలేదు.

భవనాల చుట్టూ ప్రాకారాలు ఉండాలి. ముఖద్వారాలుండాలి. అవి శిల్పకళలుట్టిపడేట్లుండాలి! ఎన్నో తరాలకు ఆ సాంప్రదాయ చిహ్నాలు తెలియాలి. ఎలాంటి ప్రవీణులు కూడా అలా కట్ట లేనట్లుండాలి. స్వదేశీ పరిజ్ఞానం ఉండాలి. మనల్ని చూచి పలుమంది ఆశ్చర్యపడాలి, గర్వపడాలి!

అలాటివే తెలుగునాట ఉన్న ప్రాచీన రాజధానీ నగర నిర్మాణాలు. అలా స్వదేశీ ఇంజనీర్లు రూపొందించినవే. నాటి రాచరికపు వైభవానికి గుర్తులు ఈ కోటలు. నాటి శిల్పకళా చాతుర్యానికి నిదర్శనం! ఈ కళలు ఘన చరిత్రకు సజీవ సాక్ష్యములు. నాటి రాజధానుల్లో ఆకాశమంత ఎత్తు భవనాలు ఉన్నాయా? కానీ ఆనాటి కోటలు చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు.



పుట్టిన నాటి నుంచే ఒళ్లంతా కళ్లు చేసుకొని ఎన్ని కోటలు కట్టారో! ఏ రాజు ఎలాటి కోటలు కట్టారో తెలుసా! ఎంతమది శిల్పులు నన్ను ఇంత ఠీవిగా నిలబెట్టారో! ఎంత ధనం ఖర్చయిందో! ఎంత మంది నాకు ప్రాణం పోయడానికి తాము ప్రాణార్పణం చేశారో ఎన్ని కథలు విన్నానో, ఎందరి గాథలు తెలుసుకున్నారో! ఇంకెన్ని గాథలున్నాయో! అస్థిత్వాన్ని కోల్పోకుండా ఉండటం కోసమే నా ఆరాటం. నాటి రాజ్యాలకు రాచకొలువును మేధాపరమైన, కళలకు, రాచరికపు హుందాతనానికి వేదికలు అంటుంది మనసు. ఒక్కసారి మరిచిపొండి.

మీ కళ్ళు విప్పారి తలపైకెత్తి నన్నే దీక్షగా చూస్తున్నారా! నాకు ఇంతటి ఠీవిని ఎవరు కట్టబెట్టారో తెలుసా! పెద్ద పెద్ద రాళ్లను ఒకదానిమీద ఒకటి ఎలా పేర్చారో చూశారా! అంతా పుస్తకాల్లో చదివామనో, ఎవరో చెబితే విన్నామనీ కాదు.. నేటి మహామహులు సైతం తలవంచి సలామ్ చేసి, నాటి పరిజ్ఞానం ఎంత గొప్పదో తెలుసుకోండి.



పిల్లలకు 'టైమ్ మిషన్' గురించి ఎన్నో ఆంగ్ల సినిమాలను పరిచయం చేస్తూ చెబుతారు. కాలాన్ని వెనక్కి తిప్పి చూపించాలనుకుంటారు. ఒక్కసారి యీ కోట గుమ్మం వద్దకు తీసుకురండి. కాకతీయుల పాలించిన నేల. చాళుక్యులు, పల్లవుల పరిపాలన అంటూ మొదలుపెట్టండి. అనగనగా రాజు. కోట నుండి యుద్ధానికి బయల్దేరాడు అంటూ బడిలో పుస్తకాల ద్వారా చెప్పిన చరిత్ర కళ్ళకు కనబడుతుంది. ఆలోచనా శక్తి మీరు ఊహించనంతగా పెరుగుతుంది. చెక్కుచెదరని 'టైమ్ మిషన్' అవునో కాదో మీరే నిర్ధారిస్తారు. కొన్నాళ్లు నన్ను కాపాడుకోవాలనే ఆలోచన చేస్తారు. ముందు తరాలకు మీరిచ్చే సంపద ఇదే.


## బంధాలకు ఇల్లు..


నేను రాతి కట్టడాన్నే! కానీ కుటుంబమంతా మీరు కలిసి రావాలని ఆశపడతాను. అలా వస్తే నా గుండె సంతోషంతో ఉప్పొంగిపోతుంది. కూర్చోవడానికి వేదికలు వేసి ఉంచుతాను. కనువిందు చేసే శిల్పాలతో ఊహల్లో నాట్యమాడిస్తాను. గుప్తంగా ఉండే కోశాగారాలను, అబ్బురపరిచే ఆహారశాలలను, ధాన్యపు గిడ్డంగులను అన్నీ పరిచయం చేస్తాను. ఇక్కడంతా కలిసి ఎంత చెప్పుకున్నా తనివి తీరని ముచ్చట్లు. ఆ మాటల్లో పెరిగే దగ్గరితనం. బంధాలకు కొలువుగా అతి పెద్ద ఇల్లు. శత్రురాజులకు దడపుట్టించిన ఫిరంగులు, రేయింబవళ్లు పహారా కాసిన కాపలాదారుల స్థావరాలు, గుర్రపు శాలలు, ఆంతరంగిక మందిరాలు ఎన్నో విచిత్రాలతో మిమ్మల్ని అడుగడుగునా విస్మయపరుస్తూనే ఉంటాను.



## నూతన హంగులు..

ఎన్నో కోటలు కనుమరుగయ్యాయి. కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయి. ఇంకెన్నో కోటలు అవసాన దశలో ఉన్నాయి. గ్రామ, జిల్లా స్థాయిలో ఉండే కొన్ని కోటల గురించి ఏ సమాచారం లేదు. కనుమరుగవుతున్న వాటిని పట్టించుకునే నాథులూ లేరు. రాజస్థాన్ రాష్ట్రంలోని కోటలు అద్భుతంగా ఉన్నాయ్! అలనాటి వైభవాన్ని ఇప్పటికీ చెక్కుచెదరనీయకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. అక్కడి కోటలకు నూతన హంగులు అద్ది, హోటళ్లుగా మార్చే నైజాన్ని తెలుసుకున్నారు. ఈ విధానం వల్ల ఆ రాష్ట్ర ఆదాయమూ పెరిగిందని వార్తలు మన చెవిన పడుతున్నాయ్! నాటి రాజులకు రక్షణ కవచంగానే కాదు ఆదాయవనరులుగాను ఉన్నాయ్. నాటి వైభవాన్ని ముందు ముందు ఇంకెంతో మందికి చాటుతూ ఉంటాయో. వాహనాలు, పరిశ్రమలు వదిలే కాలుష్యం నన్ను రోజు రోజుకూ మసకబారేలా చేస్తున్న విషయం ఎరుకేనా? రాజధానులూ, కోటలు అంటే రాకాశి అంతస్థుల భవనాలు కావు.






## మన తొలి రాజధాని

కృష్ణానదీ తీరాన ఉన్న అమరావతి ఆంధ్రుల తొలిరాజధాని. ఇప్పుడది గుంటూరు జిల్లాలో ఉంది. పంచారామాల్లో మొదటి క్షేత్రమైన అమరేశ్వర ఆలయం ఇక్కడే ఉంది. బౌద్ధులు, జైనులకు కూడా ఇది పవిత్ర క్షేత్రం. క్రీస్తు పూర్వం రెండో శతాబ్దిలో శాతవాహనుల హయాంలో వారి రాజధాని ధాన్యకటకంగా విలసిల్లింది. ఈ నగరాన్ని సందర్శించిన బుద్ధుడు ధారునీ లతో (పవిత్ర మంత్రాలు) శుద్ధి చేసిన కారణంగా కాలక్రమంలో దీని పేరు ధరణికోటగా మారింది. దేవ గురువు బృహస్పతి ఆధ్వర్యంలో దేవేంద్రుడు ఇక్కడ అమరేశ్వరుడిని ప్రతిష్టించడంతోపాటు అమరావతిగా గుర్తింపు పొందింది. పదహారడుగుల పొడవు ఉన్న స్ఫటికలింగం ఈ శైవక్షేత్రానికి ప్రత్యేక ఆకర్షణ. క్రీస్తు శకం ఏడో శతాబ్దిలో అమరావతిని సందర్శించిన చైనా యాత్రికుడు హ్యూయాన్ త్సాంగ్ ఇక్కడే ఏడాది నివసించి, ఇక్కడి విశేషాలను గ్రంథస్తం చేశాడు. క్రీస్తు శకం పదిహేడో శతాబ్దిలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు అమరేశ్వర ఆలయానికి జీర్ణోద్ధరణ చేసి, ఈ నగరానికి అమరావతిగా నామకరణం చేశారు. వెంకటాద్రినాయుడు కంటే ముందే శ్రీకృష్ణదేవరాయులు ఈ ఆలయాన్ని దర్శించుకుని, తులా భారం తూగినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది.

**బౌద్ధులు పవిత్రక్షేత్రంగా..** బౌద్ధ గురువు దలైలామా 2006 సంవత్సరంలో నిర్వహించిన 'కాలచక్ర' దీనికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. 'కాలచక్ర' ఉత్సవాల సమయంలోనే 125 అడుగులు ధ్యానబుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్టించాలని సంకల్పించారు. దీని నిర్మాణం 2014లో పూర్తయింది. దీనిపై బుద్ధుని జననం నుంచి నిర్యాణం వరకు గల ఘట్టాలన్నింటినీ చెక్కారు. ఇక్కడి మ్యూజియంలో బుద్ధుని జీవితానికి సంబంధించిన 200 శిల్పాలను ప్రదర్శనకు ఉంచారు. మరో మూడువందల శిల్పాలకు స్థలం లేకపోవడంతో షెడ్డులో భద్రపరిచారు. కొత్త మ్యూజియం ఏర్పాటైతే తప్ప సందర్శకులకు వీటి దర్శన భాగ్యం లభించే అవకాశం లేదు. మ్యూజియంలో బౌద్ధ శిల్పాలతోపాటు పద్మం, పూర్ణకుంభం, శాతవాహనుల నాటి నంది విగ్రహాలూ ఉన్నాయి. అమరేశ్వరాలయం నుంచి సేకరించిన 33 ముక్కలను మెండింగ్ చేసి, ఒకటిగా రూపొందించిన శిల్పంలో యక్ష, గంధర్వ, నంది ఆకృతులు ఉన్నాయి. బుద్ధుని నిర్యాణం తర్వాత ఆయన అస్థికలను అనేక ప్రాంతాలలో భద్రపరచిన శిష్యులు, ఇక్కడ అస్థికలను నిక్షిప్తం చేసిన చోట అద్భుత స్తూపాన్ని నిర్మించారు. ఇప్పుడా స్తూపంలోని ప్రధాన భాగాలు లండన్, మద్రాసు, కలకత్తా మ్యూజియంలలో పదిలంగా ఉన్నాయి.

**జైనుల తీర్థస్థలిగా...** అమరావతి జైనులకు కూడా పవిత్రస్థలంగా విరాజిల్లుతోంది. అమరేశ్వర స్నానఘాట్ సమీపంలో జైనుల 24వ తీర్థంకరుడైన చింతామణి పార్శ్వనాథ్ శ్వేతాంబర్ దేవాలయం జైనుల పవిత్రాలయంగా ప్రసిద్ధిపొందింది. ఇక్కడా ఏటా పదిహేను రోజులపాటు జైనుల ఉత్సవాలు జరుగుతాయి. దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జైనులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. పార్శ్వనాథ్ మూలవిరాట్ విగ్రహం కృష్ణానది గర్భంలో లభించినందున జైనులు ఇక్కడే ఆలయాన్ని నిర్మించుకుని, అమరావతిని తమ ఆరాధనా కేంద్రంగా మలచుకున్నారు.



**ఇప్పుడిలా మిగిలింది...** ఆంధ్రుల తొలి రాజధానిగా వెలుగొందిన అమరావతి ఇప్పుడు నామమాత్రపు పట్టణంగా మాత్రమే మిగిలింది. ఇక్కడి చారిత్రక వారసత్వ విశేషాలు దేశవిదేశాల పర్యాటకులను ఆకట్టుకుంటున్నా, ఇక్కడ వారికి తగిన కనీస వసతులేవీ లేవు. అమరావతికి ప్రతినెలా సగటున పదివేల మంది వరకు యాత్రికులు వస్తుంటారు. వారిలో కనీసం రెండు వేలమంది విదేశీ యాత్రికులే ఉంటారు. వసతికి తగిన అతిథి గృహాలు, సరైన ఆహార సౌకర్యాలు, కనీసం టాయ్‌లెట్లు కూడా లేకపోవటంతో యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. 17.5 ఎకరాల విస్తీర్ణంలో థీమ్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా అది భూసేకరణ దశలోనే ఆగిపోయింది. వచ్చే భక్తులు కృష్ణానదిలో స్నానాలు ఆచరించేందుకు పుష్కరఘాట్లు కనిపించవు. కాలచక్ర మ్యూజియంలో లేజర్‌షో ఏర్పాటుకు కావలసిన పరికరాలను పర్యాటక శాఖ సిద్ధం చేసినా సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగా మూలపడ్డాయి.

## రెండు ప్రాచీనాంధ్ర నగరాలు - అమరావతి - ఓరుగల్లు రెండిటినీ రాజధానిలుగా చేసుకుని తెలుగు రాజులు పాలించారు

అందొకటి అమరావతి. ఏ పూర్వఫలమోగానీ సీమాంధ్ర రాజధానీ నగరం కాబోతున్నది. శాతవాహన రాజులు అమరావతిని రాజధానిగా చేసుకుని పాలించారు. అప్పటి నగరం పేరు ధన్యాకటకం. ఈ ధాన్యకటకం పంచారామ క్షేత్రాల్లోని అమరేశ్వర క్షేత్రం. పంచారామక్షేత్రంలోని అయిదు చిత్రాలూ పరమపుణ్యప్రదమైనవి. ఇక్కడి అంతరాలయ శివలింగములన్నీ దేవతలచే ప్రతిష్టింపబడినవనే ఇతిహాస చరితమున్నది.

అమరావతిలోని శివలింగమును దేవగురువు బృహస్పతి ఆనతిపై దేవేంద్రుడు నిర్మించాడనే మరో పురాణ కథ ఉన్నది. పంచారామాల్లో అమరావతీ శివలింగం అత్యుత్తమమైనది. ప్రథమంగా ఈ శివలింగం 16 అడుగుల ఎత్తుగలదని చెబుతారు. కృష్ణానదీతీరములోని ఇంద్రకీలాద్రిలో వెలసిన కనకదుర్గమ్మ ఎదుట తీరంలోనే అమరావతి ఉన్నది.

ఇదొకనాటి పుణ్యక్షేత్రమైన శివలింగ క్షేత్రం. అధికంగా ప్రేమించిన బౌద్ధక్షేత్రం. ఆంధ్రరాజధానిగా ఏ దేశ రూపురేఖలు చిందుతుందో చూడాలి!

### ఆనాటి ఆనవాళ్లు

గోల్కొండ కోట (హైదరాబాద్)... 23 కి.మీ.
కొండపల్లి కోట (కృష్ణాజిల్లా).. 258 కిమీ
వరంగల్ కోట (వరంగల్ జిల్లా).. 150 కిమీ
భువనగిరి కోట (నల్గొండ జిల్లా).. 48 కిమీ
పెనుకొండ కోట (అనంతపురం జిల్లా).. 431 కిమీ
గండికోట (వైఎస్ఆర్ కడపజిల్లా)... 500 కిమీ
బొబ్బిలి కోట (విజయనగరం జిల్లా)... 636 కిమీ
చంద్రగిరి కోట (చిత్తూరుజిల్లా).. 572 కిమీ

# చెరిగిపోయిన చెన్నపురి ఆంధ్ర మహాసభ చిరునామా!

**చే**తిలో వెన్ననుంచుకుని నెయ్యికోసం వెదుకులాడే తెలుగువారు. వీరు సంవత్సరాలుగా చెన్నయ్ సెంట్రల్ రైల్వే స్టేషన్, రిప్పన్ (కార్పొరేషన్) బిల్డింగు మధ్య నేను చెన్నపురి ఆంధ్రమహాసభను రోయ్– అంటూ పాంచజన్యంలా శంఖమూదిన వి.పి. హాలు (విక్టోరియా పబ్లిక్ హాలు)గా తెలుగువారి సాహితీ, సాంస్కృతిక నిలయంగా– ఏళ్ల తరబడి చిరునామాగా నిలిచిన భవనాన్నుంచీ చిరునామాను చెరిపేసుకున్న 'మనం' తెలుగు మహాసభ కోసం వెతలుపడుతున్నాం.

ఎందరెందరో మహానుభావులు చెన్నపురి ఆంధ్రమహాసభకు వచ్చారు. ప్రముఖ నాటక నటులు అక్కడ నాటకాలు ప్రదర్శించారు. ప్రపంచ తెలుగు సమాఖ్యను ప్రారంభించాలనే సంకల్పము ప్రముఖ చలనచిత్ర నిర్మాత యు విశ్వేశ్వరరావుకు ఇక్కడే కలిగింది. చెన్నయ్‌లోని కళాభూషణులైన ఆర్యవైశ్యులు అక్కడే నాటకాలు పద్రర్శించడానికి రిహార్సల్సు కూడా వేసేవారు.

ఆంధ్రదేశం నుంచీ కొమ్ములు తిరిగిన మహానటులుందరూ ఇక్కడ యీ హాలులో నాటకాలు ప్రదర్శించినవారే. హాలులోని ఓ అర్ధభాగంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తుంటే మరో అర్ధభాగంలో బార్‌లో వేసిన టేబుల్‌పై (ఈపద ప్రయోగం అన్యాయమైనా ఉదహరించక తప్పడం లేదు) పేకాట ఆడుకునేవారు. వారిది ప్లేకార్డు లోకం.– ఇవతలవారిది కళాప్రదర్శనారాధ్యం. ఉన్నట్టుండి కార్పొరేషన్ వాళ్లు వెళ్ళగొడితే– తెల్లమొఖాలతో అదే కౌంపౌండ్‌లో మరో తెల్ల బిల్డింగును తెలుగువారు కట్టుకున్నారు. అప్పుడుగానీ, అసలు విషయం బోధపడలేదు. విసిరేసినట్లు వెనకాల తెలుగువారి తెల్ల బిల్డింగు, ముందున్న భాగంలో మరోవ్యక్తులది పిక్నిక్ హోటల్. ఇదంతా ఒక్క టి.జి. కమలాదేవికి తప్ప ఎవరికీ బోధపడినట్లు లేదు. పెద్దపెద్ద ప్రముఖుల కార్యక్రమాలు జరుగుతున్నాయ్. 'ప్రముఖాంధ్ర'కు శ్రీదశరథరామిరెడ్డి లక్ష రూపాలయ సేకరణ సభ ఇక్కడే జరిగింది. చెన్నయ్, చెన్నయ్ పరిసరస్థలాల్లోని నాటక సమాజాల వారు నాటకాలు ప్రదర్శించారు. పేకాటాడేవురు ఆడుతున్నారు. ఓమూల పుస్తకాల రేక్‌లో తెలుగు పత్రికల రీడింగ్ రూము ఉండేది. వెంకటగిరి రాజాగారు వస్తుండేవారు. నా మధురవాణి పత్రికలను, నేను రిలీజ్ చేసే పుస్తకాలను చదువుతుండేవారు. ఎప్పటి పుస్తకాల డబ్బును అప్పుడే ఇచ్చేవారు. కొన్నాళ్లు పక్కవాళ్లకిచ్చారు. ఒకసారి బాకీ పడ్డారు. రాలేదు. అక్కడ పనిచేసే కుర్రాడికిచ్చి వెళ్లిపోయారు. అటు తరువాత కృతజ్ఞతలు చెబుదామని వీపీ హాలుకు వెళ్లాను. రెండు రోజులు వెళ్ళి చూచినా, ఆయన రాలేదు. అక్కడి ఉద్యోగి అడిగితేవారు దివంగతులయ్యారని చెప్పాడు. ఆయన కూర్చునే చోటు ఖాళీగా కనిపించింది. విపిహాలులో చెన్నపురి ఆంధ్ర మహాసభకు చెల్లుచీటి వస్తుందని గ్రహించారేమో!

చిక్కటి ఎరుపు రంగు గోడలతో ఆ భవనం ఉండేది. రాయపురం రైల్వేస్టేషన్‌లా మద్రాసు హైకోర్టులా, ఎగ్మూరు కోర్టు బిల్డింగులా, మ్యూజియం, మ్యూజియం థియేటర్, మద్రాసు కన్నెమరా గ్రంథాలయంలా హుందాతనమొలికిస్తున్న భవనాలకు ధీటుగా ఉన్న భవనం చెన్నపురి ఆంధ్రమహాసభ ఉన్న భవనం. చెన్నయ్‌లో పెద్ద తరంవారు పంచాగ్నుల సూర్యనారాయణ, జెవి సోమయాజులు బివియస్ మణి, ఎంబెరుమనార్ చెట్టి వంటి శ్రేష్ఠులుండగానే పోయింది.

అన్నాదురై వంటి రాజకీయ పెద్దలందరూ అక్కడ జరిగిన తెలుగు మహాసభలకు వచ్చారు. ఆంధ్ర రాష్ట్ర మంత్రులు వచ్చారు. న్యాయాధీశులు వచ్చారు. అందరూ దండలు వేయించుకుని వెళ్లినవారే. కోట్లకు పడగలెత్తినవారెందరో ఉన్నారు. వాళ్లు తన్నుకానట్లున్నారు.

నిజానికా ఎర్రభవనం మద్రాసు టౌన్‌హాలు. ఏ సభలైన అక్కడే జరిగేవి. ఏ పెద్దలు వచ్చినా అక్కడే మాట్లాడేవారు. అక్కడ సభలు జరుపడం అక్కడి సభల్లో మాట్లాడడం– ఓ హుందాగా తలిచేవారు.

అప్పటి మద్రాసు అంటే తెలుగువారి మద్రాసు అప్పటి టౌనుహాలు అంటే తెలుగువారి టౌన్‌హాలు. చెన్నపురి ఆంధ్ర మహాసభ అక్కడ ఏండ్ల తరబడి ఉండడంతో అది చెన్నపురి ఆంధ్రమహాసభ భవనంగానే చెలువొందింది. మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, గోపాలకృష్ణ, గోఖలే, సుబ్రహ్మణ్య భారతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి దేశీయ ఉద్దండులూ, అతిథులుగా వచ్చిన విదేశీ ప్రముఖులు ఇక్కడే ఉపన్యాసాలిచ్చారు.

1880–81 సం॥ములో వితరుణశీలురైన ఎందరో తెలుగుదాతలు, జమీందార్లు, రాజులు, వణిక్ప్రముఖులూ ఒక్కొక్కరు –అదృష్ట సంఖ్యగా 16ను భావించి, 16 వేల రూపాయాలు చొప్పున– ఓ 16+16 = 32 మంది పెద్దలు విరాళముల్విడంతో కార్పొరేషన్ స్థలాన్ని 90 ఏండ్లు లీజ్ పద్ధతిలో తీసుకుని, 1883 సం॥ము నవంబర్ నెలాఖరులకు ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసారు. మద్రాసులో – యిలాటి వైవిధ్య భవనాలను నిర్మించిన నంబెరుమాళ్ చెట్టిగారు తనదైన పంథాలో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసారు. విజయనగరం మహారాజు పూసపాటి ఆనందగజపతి రాజు – ఇక్కడ మట్టికి శంఖుస్థాపన చేసారు.

విరాళాలిచ్చిన 32 మందికికాగా, శంఖుస్థాపన చేసిన విజయనగర మహారాజు గారికిగానీ 60 మాసాలు సుదీర్ఘ శ్రమతో భవన నిర్మాణం చేసిన నంబెరుమాళ్ చెట్టికిగారికి గానీ– నిర్మాణ పూర్తి, ప్రారంభోత్సవ సమయాల్లో – మద్రాసు ఆంధ్ర మహాసభగా నామకరణం చేద్దామనే సంకల్పం కలుగలేదు. వారందరి దృష్టిలో చెన్నపట్నం తెలుగువారి పట్ణమనే ధైర్యం ఉండి ఉండవచ్చు.

బ్రిటిష్‌వారి పాలనంలో మనం ఉన్నాం. బ్రిటిష్‌రాణి విక్టోరియా మహారాణి స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయ్. స్వామిభక్తి పరాయణులైన మన తెలుగువారు– కృతజ్ఞతా భావంతో 'విక్టోరియా పబ్లిక్ హాలు' (విపిహాలు) అనే పేరుపెట్టారు. ఈ హాలులోనే మొదట తెలుగు నాటకం ప్రదర్శింపబడింది. తొలి సినిమా ప్రదర్శనం కూడా యిక్కడే జరిగింది. ఇది తెలుగువారి హాలుగా, తెలుగువారి పెత్తనంలో ఉంది. చుట్టూ ఎన్నో ఆక్రమణలొచ్చాయ్. అక్రమ కార్యాలు జరుగుతూవచ్చాయ్. చివరికి హాలు ఉనికి కూడా పోయింది. చెన్నపురి ఆంధ్రా మహాసభ పేరు చెరిగిపోయింది.



# సత్సాంగత్యం, సద్గ్రంథపఠనం, సత్పురాణ శ్రవణం మనసులోని అంతఃశత్రువులను అదుపులో ఉంచుతాయ్!

ఒక అందమైన చిత్రాన్నో, దృశ్యాన్నో, వ్యక్తినో చూడగానే కన్ను ఠక్కున అక్కడ ఆగిపోతుంది. శ్రావ్యమైన మాటల్ని, లేక సంగీతాన్ని వినగానే చెవి ఇంకా వినమంటుంది. వంటింట్లోంచి వచ్చే వంటల ఘుమఘుమలు, గుభాళించే పరిమళాలు, మనల్ని ఆ దిశగా లాగేస్తాయి. ఎన్ని రుచులు అందించినా, ఇంకా తృప్తిపడక, నాలుక మరిన్ని అందించమంటూ మొరాయిస్తుంది. మెత్తటి పరుపుల కోసం, దేహానికి హాయిని కూర్చే లేపనాల కోసం, దేహం పట్టుబడుతుంది.

కళ్లు, చెవులు, నాలుక, చర్మం వీటిని జ్ఞానేంద్రియాలు అంటారు. మాట్లాడేమాట, వాణి (గొంతు), పాద (కాలు), వాయు (మలద్వారం), ఉపస్థ (మూత్రద్వారం) వీటిని కర్మేంద్రియాలు అంటారు. జ్ఞానం కలుగుతుంది కనుక జ్ఞానేంద్రియాలు, పనులు చేయిస్తున్నాయి కనుక కర్మేంద్రియాలు అంటున్నారు. ఈ పది గుఱ్రాలూ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాయి కనుక సాధకుడు అనేవాడు నిరంతరం, యావజ్జీవితం అదుపులో పెట్టడడమే హయమేధం!

కఠోపనిషత్తులో నచికేతుడితో యమధర్మరాజు చెప్పిన మాటల్ని మొదట మనం తెలుసుకోవాలి. మృత్యువే గురువుగా అసలు రహస్యాల్ని వెల్లడించిన గొప్ప ఉపనిషత్తు ఇది.

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు ।**
**బుద్ధింతు సారథిం విద్ధిం మనః ప్రగ్రహమేవ చ ॥**

ఓ నచికేతా! శరీరము రథము. బుద్ధే సారథి, మనస్సు కళ్లెము అని గ్రహించు. ఆత్మ దాన్ని అధిరోహించిన యజమాని అని తెలుసుకో! ఇంద్రియాలే గుఱ్రాలు. ఇంద్రియ విషయాలే అవి పరుగులు తీసే మార్గాలు అని అంటారు. శరీరము ఇంద్రియాలు మనస్సులతో కూడివున్న ఆత్మనే ప్రాజ్ఞులు భోక్తగా చెపుతారు.

మనస్సును విచ్చలవిడిగా వదిలేసి సరైన జ్ఞానం లేకుండా ఎవరైనా ఎల్లప్పుడూ సంచరిస్తే అలాంటివాని ఇంద్రియాలు దోషం వున్న గుఱ్రాలు అదుపుతప్పి పోయినట్లే వశం తప్పిపోతాయి. అయితే ఎల్లప్పుడూ మనస్సును అదుపులో వుంచుకొని సరైన జ్ఞానం కలిగి ప్రవర్తించే వాని ఇంద్రియాలు సారథియొక్క మంచి గుఱ్రాల వలె తన వశంలో ఉంటాయి.

సరైన జ్ఞానం లేక చెదరిపోయిన మనస్సుతో ఎల్లప్పుడు అశుచిగా ఉండేవాడు ఆ గమ్యాన్ని పరమపదాన్ని ఎన్నటికీ పొందలేడు. అంతేకాక జననమరణ చక్రరూపమైన సంసారంలో పడిపోతాడు. కానీ ఎవడైతే విజ్ఞానవంతుడో వశము చేసుకొన్న మనస్సు గలవాడో సదా పరిశుద్ధుడో అతడు పునర్జన్మలేని ఆ పరమ పదాన్ని చేరుకుంటాడు. బుద్ధే సారథిగా గలవాడు మనస్సు చాకచక్యంతో పట్టుకోబడిన కళ్లెమైన అయిన మానవుడు ప్రయాణపు గమ్యమైన విష్ణువుయొక్క పరమపదాన్ని (సర్వవ్యాపక పరమాత్మ అయిన పరంధామున్నే) చేరుకుంటాడు.

ఇంద్రియముల కంటే పదార్థాములు గొప్పవి. పదార్థముల కంటే మనస్సు గొప్పది. మనస్సు కంటే బుద్ధి గొప్పది. బుద్ధి కంటే మహత్తరమగు ఆత్మ (హిరణ్య గర్భుడు) గొప్పది. మహత్తరమైన ఆత్మకంటే అవ్యక్తము గొప్పది. అవ్యక్తము కంటే పురుషుడు (పరమాత్మ) గొప్పవాడు. పురుషుని కంటే గొప్పది మరి ఏదియులేదు. అదియే అన్నిటికిని పరాకాష్ట. అదియే పరమగమ్యము.

మహాభారతం లోని వనపర్వంలో కౌశికుడు 'ఇంద్రియాలను నిగ్రహించడం' ఎలా అని ధర్మవ్యాధుడిని అడుగుతాడు. అప్పుడు ఆయన చెప్పిన సమాధానం ఇది:

అనంతాకాశం, గాలి, అగ్ని, నీరు, భూమి అనేవి పంచభూతాలు. మరలా భూమి నీటిలోను, గాలి అగ్నిలోను, అగ్ని వాయువులోను, వాయువు ఆకాశంలోను లీనమౌతాయి. మొదట ఆకాశానికి హద్దులు లేని అనంతాకాశం. అంతా చీకటి, శూన్యము. ఆ ఆకాశంలో నుండి ప్రచండ వాయువు, ఉద్ధృతమైన గాలి ఆ గాలిలోని ధాతు సంయోగంతో నీరు పుడుతుంది. ఆ నీరు ఘనీభవించి మంచుఖండాలు, ధూళి మేఘాలు ఏర్పడతాయి. అవి శిలా రూపం చెంది భూమి ఏర్పడుతుంది. మరలా అదే క్రమంలో ప్రళయకాలంలో సముద్రాలన్నీ ఏకమై భూమి జలమయ మౌతుంది. అనావృష్టి ప్రారంభమై ఎండలు అధికమై ఆ ప్రచండాగ్నికి నీరు ఆవిరై వాయు రూపం పొంది ఆకాశంలో లయమౌతుంది. చెవితో వినడం, నాలుకతో రుచి చూడడం, కంటితో చూడడం, ముక్కుతో వాసన చూడటం పంచేంద్రియాలు చేసే పనులు. అంటే పంచభూతముల గుణములైన శబ్ద, స్పర్శ, రస, గంధాలు ఇంద్రియ విషయాలు. పంచేంద్రియములకు మూలం మనసు. మనసు ఆరవది, బుద్ధి అహంకారం మనసుకు తోడు ఎనిమిది. సత్వ, రజో, తమో గుణాలు మానవులకు సహజం. ఈ భూత ప్రపంచం అవ్యక్తము (పరమాత్మ) నుండి సృష్టింపబడి అవ్యక్తంలో లీనమౌతాయి. కాని పంచేద్రియాలకు ఈ అవ్యక్త రూపం దైనందిన కార్యాలలో, నిరాకారమైన మనోభావనలో వివిధ రూపాలలో గోచర మౌతుంది. మానవుడు పంచగుణాలకు వశుడై భోగలాలసుడౌతున్నాడు. విషయ వాంఛల నుండి మనసుని మళ్లించడమే తపస్సు, వైరాగ్యం. ఇంద్రియముల నివారించిన స్వర్గం. ఇంద్రియములను లొంగిపోయిన నరకం. కోరికలతో సతమతమయ్యే మనసును అదుపులో పెట్టుకోవడమే మోక్షం. దేహం రథమైతే ఇంద్రియాలే గురాఱ్రలు. ఆత్మ సారథి, ధైర్యం పగ్గాలు. మానవుడు మనసును నిగ్రహించి ధైర్యమనే పగ్గాలతో ఇంద్రియాలనే గుఱ్రాలను అదుపుచేస్తూ మోక్షమనే గమ్యాన్ని చేరాలి. ఇంద్రియము పోవుచోటుకు మనసు పోతుంది కనుక ఇంద్రియములను అదుపు చేస్తే జ్ఞానియోగి.

కాబట్టి బహిర్ముఖమైన మన ఇంద్రియాలను అంతర్ముఖం కావించి ప్రయాణం కొనసాగించాలి. అందుకే మన పెద్దలు మితంగా తినమని, సత్సాంగత్యం చెయ్యమని, దేవాలయాలకు, హరికథలకు, నామసంకీర్తనానికి తీర్థయాత్రలకు వెళ్లమని కొన్ని పద్ధతులు ఏర్పరిచారు. పండుగలకు, జాతరలకు, దేవాలయాలకు చేరినప్పుడు, దైవచింతన సత్సాంగత్యం లభించే భాగ్యం దక్కేది. యోగుల, మునుల స్పర్శతో నదీనాదాల్లో స్నానం చేసినప్పుడు మనలోని పాపకర్మలు మనకు తెలియకుండానే ప్రక్షాళనం జరిగేది, సన్మార్గంలో పయనించే అవకాశం దక్కేది.

మనస్సుకో చిత్రమైన శక్తి ఉంది. అది మనం ఎక్కువగా మననం చేసే వస్తువుపై లయమైపోతుంది. అందుకే నిత్యం సద్గ్రంథాలు చదువుతూ ఉంటే అది ఆ భక్తుల గాథలలో, పరమాత్మ చింతనలో లీనమైపోతుంది. ఇదివరకు ప్రతి ఇంట్లోను ఎన్నో దేవుడి పటాలు, విగ్రహాలు ఉండేవి. అంటే.. మన కన్ను మనకు తెలియకుండానే, ఎదురుగా ఉన్న దైవరూపాన్ని చూస్తూ దైవచింతన చేసే అవకాశం ఉండేది. మంచివారితోస్నేహం, వారు చెప్పే మంచి మాటల్ని వింటూ దైవం దిశగా అడుగులు వేసే అవకాశం లభించేది.

కాని ఇప్పుడు... ఇంట్లో దేవుడి పటాలు ఉండటం అవుట్ ఆఫ్ ఫాషన్. ఎదురుగా ఏ అర్థం పర్థంలేని పెయింటింగ్స్, వాల్ హాంగింగ్స్ ఉంటాయి. మనసు వాటివైపే పోతుంది. నిత్యం మనం కొలిచే సీరియల్ మాత, ఎన్నటికి సత్సంగం కానేరదు. ఆ రూపాన మనం వింటున్నది, చూస్తున్నది అంతా నిశ్చయంగా దుస్సంగమే. మంచి మాటలు ఎన్నడూ మనకు తలకెక్కవు. దూషణ, పరనింద పరమరుచిగా ఉంటాయి.

చెడు మాట్లాడేవారిని చాడీలు చెప్పేవారిని వర్జిద్దాము. మితంగా తింటూ హితంగా జీవిద్దాము. డబ్బు పెరిగే కొద్దీ విలాసాలకు ఖర్చు చెయ్యకుండా, దానం పెంచుదాము. ఇంట్లో మనం ఎక్కడ కూర్చున్నా. మన కన్ను దైవాన్ని చూసేలా ముందుగా ఇంటిని తీర్చిదిద్దుదాము. సత్సాంగత్యం, సద్గ్రంథాలు చదవడం, నామస్మరణ వంటివాటి ద్వారా క్రమంగా మన అంతఃశత్రువులను అదుపులో పెట్టుకుని, అప్రమత్తంగా ఉంటూ దైవమిచ్చిన ఈ అపురూపమైన మానవజన్మను సార్థకం చేసుకుందాం. ఓం తత్సత్.

**– భావరాజు పద్మిని**



జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

# ఆత్మవిశ్వాసం లేనివాడు నాస్తికుడే

- స్వామి వివేకానంద



# చెన్నై తెలుగు వారిని సమ్మోహనపరిచిన చాగంటి ప్రవచనం "కుటుంబ వైభవం"



భారతీయ సాంస్కృతిక పీఠం గత నాలుగైదు సంవత్సరాలుగా వాగ్దేవి వరపుత్రుడు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారిచే చెన్నైలో ప్రవచనాలు చెప్పించడం జరుగుతూ వుంది. చెన్నై ప్రజలు దానికోసం ఎదురుచూస్తు వున్నట్టు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. చెన్నైలో ఎన్నో కార్యక్రమాలు జరుగుతూ వుంటాయి. అవి సాంస్కృతిక కార్యక్రమాలు, రాజకీయ కార్యక్రమాలు, సినిమా కార్యక్రమాలు, నృత్య కార్యక్రమాలు, కవితా గోష్టిలు ఇలా రకరకాలుగా, కాని భారతీయ సాంస్కృతిక పీఠం ఆధ్వర్యంలో జరిగే  చాగంటివారి ప్రవచనాలకు మాత్రం ఎక్కడినుండి జనం అలా తండోపతండా లుగా వస్తారో అంతుచిక్కని ప్రశ్నగా వుంటుంది. ఆ కుచలాంబాళ్ కళ్యాణమండపంలో మెయిన్ హాల్, డైనింగ్ హాలు పూర్తిగా నిండిపోయి క్రింద కూర్చుని, ప్రక్కనా నిలబడి ఆ ప్రవచనాలను వింటూ వుంటారు. పైగా ఈ ప్రవచనాలు యథాతథంగా SVBC చానల్‌లో ప్రసారమవుతాయి. అయినా ఆయనను ప్రత్యక్షంగా చూడాలని, ఆయన మాటలు వినాలని ఆధ్యాత్మికానందం పొందాలని అలా జనం వచ్చేస్తున్నారు. ఈసారి ఆయన ఎంచుకున్న విషయం "కుటుంబ వైభవం". చాలా గొప్పగా వుంది. కుటుంబంలో ఒకరిపట్ల ఒకరికి ఉండవలసిన ఆప్యాయతలు, గౌరవ మర్యాదలు ఎవరిపట్ల ఎవరు ఎలా నడుచుకోవాలో మొదలగు విషయాలు ఆయన రామాయణం, భారతం, భాగవతం నుండి ఉదహరిస్తూ చాలా గొప్పగా చెప్పారు. ప్రతివాడికి వారి యొక్క ధర్మం అంటూ ఒకటుంటుంది అదే స్వధర్మం. ముందు ఆ ధర్మాన్ని మనం పాటించాలి. ఆ ధర్మాచరణము ఎదుటివారి యోగ్యతా యోగ్యతలను బట్టి కాకుండా, ఎప్పుడూ నీవైపు నుండి ఆలోచించాలి. నువ్వు కొడుకుగా వుంటే ఏం చెయ్యాలి. నువ్వు తండ్రివయితే ఎలా నడచుకోవాలి. అవతలివారి అర్హతానర్హతలతో సంబంధం లేదు. నీ ధర్మం నువ్వు నిర్వర్తించడం నీ విధి. అవతలి వ్యక్తి ప్రాజ్ఞుడా, మూఢుడా, అనేది నీకనవసరం. నువ్వు చెయ్యాల్సిన ధర్మాన్ని నువ్వు చెయ్యాలి. ఇంకా తల్లిని మించిన దైవం లేదు. తండ్రి కొడుకుల బంధమే కాదు, అన్నతమ్ములు ఎలా వుండాలి, అక్కచెల్లెళ్ళు ఎలా వుండాలి. ఇంటి ఆడకూతురిని ఎలా చూసుకోవాలి. మామగారికి కోడలికి మధ్య వుండవలసిన బంధం ఎలా వుండాలి ఇలా చాలా విషయాలు ఉదాహరణలతో చెప్పారు.

కుటుంబ వ్యవస్థ చితికి ఛిన్నాభిన్నమవుతున్న ప్రస్తుత పరిస్థితులలో చాగంటివారి ప్రవచనం ఒక మేలుకొలుపు. ఆయన చెప్పినవాటిలో అతిముఖ్యమైనది ఎన్ని గొడవలొచ్చినా, ఎటువంటి పరిస్థితి ఎదురైనా కలిసి వుండాలేకాని విడిపోకండి. అలాగే నేను చెప్పేవన్నీ శాస్త్రంలో వున్నవే చెపుతాను. ధర్మం అంటే సనాతన ధర్మం. సనాతనం అంటే పురాతనమైనది కాదు, పాతది కాదు. అందుకని మేము ధర్మం సృష్టిస్తాము అనే వెర్రిమొర్రి ఆలోచనలు వద్దు. సనాతనం అంటే భగవంతుడి నుంచి వచ్చినది. మన వేదాలు, స్మృతులు, పురాణాలలో చెప్పబడ్డది. అంతేకాని మిడిమిడి జ్ఞానంతో, మతిలేకుండా అజ్ఞానంలో కొత్త భాష్యాలు చెప్పకండి, ఇంటిలో వుంటూ ఇంటిని తగలెట్టకండి అంటూ చురకలూ వేశారు. ఇంకా అతిథి అంటే ఎవరు, అభ్యాగతి అంటే ఎవరు అని కూడా చాలా చక్కగా వివరించారు. వారి మూడు రోజులు ప్రవచనాలు విన్నాక కుటుంబంలో వుండవలసిన పద్ధతికి మనం ఎంత దగ్గరగా వున్నాం అని ప్రతివారు తమకు తాము బేరీజు వేసుకు చూసుకుంటే మనమెవరిమో, మనమేంటిటో మనకు తెలిసిపోతుంది. ఆయన ప్రవచనం వింటూ వుంటే రెండు మూడు చోట్ల కంట తడిపెట్టిన సందర్భాలు వున్నాయి. అంత గొప్పగా వుందా ప్రవచనం. సనాతన ధర్మాన్ని ఆచరించి కుటుంబ వైభవాన్ని, గౌరవాన్ని, మన సంప్రదాయాలని గౌరవించడం మన ప్రథమ కర్తవ్యం.

ఇక కృష్ణారావు రమణయ్యరాజా గారి గురించి చెప్పాలి అంటే సంవత్సరానికి సంవత్సరం ఆయన ఏదో కొత్తదనం చూపుతూనే వున్నారు. చేసేది ఒక్క కార్యక్రమ మయినా చాలా పద్ధతిగా క్రమశిక్షణతో చేస్తున్నారు. చాగంటి వారిని ఎంత గౌరవంగా చూస్తున్నారో అలాగే ప్రవచనానికి వచ్చేవారిని అదే మర్యాదతో చూడడం విశేషం. మూడు రోజులు శ్రవణానందం, నయానందంతో పాటు జిహ్వకు రుచికరమైన అన్నప్రసాదంతో జిహ్వానందం కలిగించారు. 6 గంటలకు ప్రారంభమయ్యే ప్రవచనా నికి సాయంత్రం 5 గంటలకు హాలు నిండిపోవడం విశేషం. ఇవన్నీ చాగంటి వారి పట్ల చెన్నై తెలుగువారికి వున్న గౌరవభావాన్ని తెలుపుతోంది. ఆశేషజనాన్ని ఆయన ప్రవచనం అంతగా ఆకట్టుకుంటుంది  భారతీయ సాంస్కృతిక పీఠం మూడు రోజుల ప్రవచనా కార్యక్రమాలు చెన్నై తెలుగు వారిని విశేషంగా ఆకర్షించాయి. ఆఖరిరోజున వారు ఆ కార్యక్రమానికి చేయూతనిచ్చిన ప్రతివారికి పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పడం చాలా బాగుంది. మళ్ళీ ఎప్పుడు ఒక సంవత్సరం తిరిగి భారతీయ సాంస్కృతిక పీఠం వారు "చాగంటి వారి ప్రవచనాలు" ఏర్పాటుచేస్తారు? ఎప్పుడు వస్తాయా అనేంత గొప్పగా వుంది ఆ కార్యక్రమం. ●






అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే
250 నెలలుగా
250 సంచికలను
శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।
ప్రముఖాంధ్ర
- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!
'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)
గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు
చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
November 2015

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

